

ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

రంగారెడ్డిఅర్బన్/కందుకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఇద్దరి పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.అనిత పారిశుధ్యం, ట్రాక్టర్ నిర్వహణ, చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వహించారు. కందుకూరు మండలం కొత్తగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్.ఉమాదేవి ఎన్నికల విధుల నిర్వహణలో అలసత్వం వహించారు. ఈ ఆరోపణలతో వారిని సస్పెండ్ జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పొందేందుకు ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి కోసం వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డ్రైవింగ్, ఫొటో, వీడియోగ్రాఫర్, బ్యుటీషియన్, జ్యూట్ బ్యాగ్ టైలరింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో శిక్షణ పొందేందుకు ఆన్‌లైన్‌లో ఈనెల 23వ తేదిలోపు దరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9603525866 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆమె కోరారు.



విద్యపై పెట్టే ప్రతి పైసా భవిష్యత్‌కు పెట్టుబడి

రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ వెంకటేశ్

5



ఉమ్మడి జిల్లాలోని సర్కార్ బడులకు నూతనోత్సాహం వచ్చింది. గతంలో విద్యార్థులు లేక మూతపడిన ప్రభుత్వ పాఠశాలలు ఈ ఏడాది మళ్లీ తెరుచుకున్నాయి. జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయులు చొరవ చూపి పిల్లల నమోదును చేపట్టారు. ప్రధానంగా బడిబాట కార్యక్రమం ద్వారా గతంలో మూతపడిన పాఠశాలల్లో పిల్లలను చేర్పించడంలో సఫలమయ్యారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 32 స్కూళ్లు రీ ఓపెన్ కాగా, వాటిల్లో 225మంది పిల్లలు చేరారు. ఇంకా మరికొందరు చేరే అవకాశం ఉంది.

మూతబడి.. తెరుచుకొని!

ఉమ్మడి జిల్లాలో 32 స్కూళ్లు రీఓపెన్

- ఈ ఏడాది ఇప్పటివరకు 225 మంది పిల్లల చేరిక
- ప్రత్యేక చొరవ చూపుతున్న జిల్లా విద్యాశాఖ
- సత్ఫలితాలిస్తున్న 'బడిబాట' కార్యక్రమం
- పిల్లల తల్లిదండ్రులకు భరోసానిస్తున్న టీచర్లు



కేశవపల్లిలో స్కూల్‌లో బోధిస్తున్న టీచర్ అమృత

రంగారెడ్డి అర్బన్/ధారూరు/ కులకచర్ల/ నవాబుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లేక మూతపడిన ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులొచ్చాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మూసేసిన బడులను పునప్రారంభిస్తామని చెప్పిన సంగతి విదితమే. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో విద్యార్థులు లేక మూతబడిన స్కూళ్లు ఈ విద్యాసంవత్సరం రీ ఓపెన్ చేశారు. అధికారులు జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లలో ప్రవేశాలకు వీలు కల్పించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 'మేమున్నాం.. మీ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించండి' అంటూ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. దీంతో పరిస్థితిలో

మిగతా 5వ పేజీలో...

ప్రైవేట్‌కు వెళ్లకుండా మాట్లాడతా..



తండాలో చాలా మంది పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నారు. తండావాసులతో మాట్లాడి ప్రైవేట్ పాఠశాలకు వెళ్లకుండా చూస్తా. తండాలోనే పాఠశాలను తిరిగి ప్రారంభించారు. కావున ఇక్కడే చదువుకునేలా ప్రయత్నిస్తాను.

మోతీలాల్, ఎర్రగోవింద్‌తండా

నడక తప్పింది



మా తండాలో పాఠశాలను తిరిగి తెరువడం వల్ల వేరే గ్రామానికి నడిచే వెళ్లే బాధ తప్పింది. మూడవ తరగతి వేరే ఊరిలో చదివా. తిరిగి సొంతతండాలో నాలుగో తరగతి చదువుతున్న. బడిని తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉంది.

ఉదయ్, నాలుగో తరగతి విద్యార్థి, ఎర్రగోవింద్‌తండా



జైపాల్ రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు

జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

ఆమనగల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత సూదిని జైపాల్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. జైపాల్‌రెడ్డిని జాతి ఎప్పటికీ మరువదని వారు పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో శుక్రవారం జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని మంత్రులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్‌రెడ్డి కృషిని వారు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు సూదిని రాంరెడ్డి, బాలాజీ సింగ్, సూదిని పద్మారెడ్డి, మనోహర్‌రెడ్డి, భట్టు కిషన్ రెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పద్మారెడ్డి, కొండల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ్మా, వెంకటేశ్వర్‌గౌడ్, బీచ్యనాయక్, బీక్యనాయక్, జగన్, యాదయ్యాగౌడ్, గుర్రం కేశవులు, చేగూరి వెంకటేశ్, విజయ్, కృష్ణనాయక్, మండ్లీ రాములు, శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్ రెడ్డి, షాబొద్దీన్, రాజేశ్, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేశ్‌గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌వోలతో ఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

- ఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, జులై11(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా తయారు చేయాలని ఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వో (బూత్ లెవల్ ఆఫీసర్లు)లకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోపు బూత్‌లెవల్లో ఉన్న ఓటర్ లిస్టులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లందరూ ఒకే దగ్గర ఉండేలా చూడాలని తెలిపారు. అలాగే తప్పుగా నమోదైన ఇంటి నంబర్లను సరిచేయాలని సూచించారు. జాబితాలో డబుల్‌గా నమోదైన, మృతిచెందిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో కాలువలు!



ఎంపీపటేల్‌గూడ శివారులోని పిరంగి నాలాలో అడ్డంగా వేసిన పైపులైన్

ఆక్రమణలతో తగ్గిన పులందరీ, రాచకాల్వల విస్తీర్ణం



కొంగరకలాన్ దాతర్ చెరువు కాల్వ ఆక్రమించి, కొత్త కాల్వను నిర్మిస్తున్న రియల్టర్లు

- కల్వర్టును తొలగించిన రియల్టర్లు
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- అధికారుల తీరుపై విమర్శలు

ఆదిభట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): రియల్ వ్యాపారుల ఆక్రమణలకు హద్దు అదుపు లేకుండా పోతోంది. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. నాలాల పక్కన, చెరువుల సమీపంలో ఉన్న భూములను కొనుగోలు చేయడంతో పాటు పక్కనే ఉన్న శిఖం భూములు, బఫర్ జోన్, చెరువు కట్టలు, కాలువలను యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారు. శిఖం భూముల్లో రాత్రి రాత్రికే మట్టి నింపి చెరువు ఫుల్‌ట్యాంక్ లెవల్‌ను తగ్గిస్తున్నారు. అంతేకాకుండా బఫర్‌జోన్, చెరువు విస్తీర్ణాన్ని తగ్గించడానికి కల్వర్టులను సైతం తొలగిస్తున్నారు. కబ్జాలపై ఇరిగేషన్ అధికారులకు రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా నామమాత్రపు చర్యలతో

మిగతా 6వ పేజీలో...

ఆక్రమణల నుంచి కాల్వలను కాపాడాలి



చెరువుల్లోకి నీరు వచ్చే ప్రధాన కాల్వలను రియల్ వ్యాపారులు అడుగడుగునా ఆక్రమిస్తున్నారు. చెరువులు, కాల్వల్లో రాత్రివేళ మట్టి పోసి నింపుతున్నారు. ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి హద్దురాళ్లు ఏర్పాటు చేసి చెరువులు, కాల్వలను కాపాడాలి.

- గోదాసు మధు, కొంగరకలాన్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్ రావు



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్ రావు

ఆమనగల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవల అందించాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు సూచించారు. సమయ పాలన తప్పక పాటించాలని ఆదేశించారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రులలో మందుల కొరత లేదని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. వైద్యులు మంజులాదేవి, నాగరాజు, షైమూనాబేగం, జయశ్రీ, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, సిబ్బంది చంద్రశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, వేణు, నాగేశ్వరి, ఏసుమని, ఇందిర పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగిరం చేయండి

- కలెక్టర్ నారాయణరెడ్డి



యాచారం : అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్

యాచారం/మాడ్గుల, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో కొలతలు అటుఇటుగా ఉన్నా తిరస్కరించకుండా సరి చేయించాలన్నారు. శుక్రవారం మండల తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం చేయొద్దని డీఈ సంపత్‌కు ఫోన్ చేసి ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వన మహోత్సవంలో ప్రతీ వ్యక్తి రెండు మొక్కలు నాటేలా అధికారులు చొరవ చూపాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, తిరుపతిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీవో శ్రీలత, ఏపీవో లింగయ్య తదితరులున్నారు. అలాగే మాడ్గుల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు నిర్మించుకుంటే ఖర్చు తక్కువ అవుతుందని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినయసాగర్, డీటీ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగిన లాటరీ ప్రక్రియ

కందుకూరు : ఫార్మా భూబాధితులకు ప్లాట్ల పంపిణీకి కొనసాగుతున్న లాటరీ ప్రక్రియలో శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. మీర్కాన్‌పేట, పంజగూడ తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలో హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లోని ఏటీసీ కేంద్రంలో ఒక ఎకరం భూమి ఇచ్చిన రైతులకు 121గజాల ఇంటి స్థలం కేటాయింపునకు లాటరీ తీశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్‌మోహన్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, తహసీల్దార్‌లు కె.గోపాల్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

సాగు చేయని భూమిలో గోశాలను నిర్మించండి

- ఎన్కేపల్లి వివాదంపై సీఎంకు లేఖ రాస్తా
- టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



రైతులతో మాట్లాడుతూన్న బక్కని నర్సింహులు

మొయినాబాద్ రూరల్, జూలై11(ఆంధ్యజ్యోతి): జిల్లాలో అనేక ప్రభుత్వ స్థలాలు సాగుకు పనికిరానివి ఉన్నాయని, వాటిల్లో గోశాలను నిర్మించాలని టీటీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు కోరారు. అంతేకాని రైతుల నుంచి సాగు భూములను లాక్కోవడం సరికాదన్నారు. ఈ వివాదంపై సీఎం రేవంత్‌కు లేఖ రాస్తానని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మొయినాబాద్ మున్సిపల్ పరిధి ఎన్కేపల్లిలో గోశాలను నిర్మించే భూములను సందర్శించారు. అక్కడి రైతులతో ఆయన మాట్లాడి వారికి మద్దతు ప్రకటించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ ఎన్కేపల్లి రైతులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటుందని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 చట్టాన్ని ఇక్కడ కూడా తీసుకురావాలన్నారు. ఆర్థికంగా పలుకుబడి ఉన్నవాళ్లు పేదలకు సహాయం చేయాలనేది ఈ చట్టం యొక్క ఉద్దేశమన్నారు. అయితే ఇదే సమయంలో బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రత్నం అక్కడికి రావడంతో ఇద్దరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎల్గని యాదయ్య గౌడ్, షాబాద్ మాణిక్యం, రైతులు ఉన్నారు.



షాద్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

జనాభా పెరుగుదలపై అవగాహన ఉండాలి

- షాద్‌నగర్‌లో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

షాద్‌నగర్ అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. తల్లి ఆరోగ్యం, జనాభా పెరుగుదలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. బిడ్డకు బిడ్డకు మధ్య ఆరోగ్యకరమైన సమయం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్రవంతి, రాఘవేందర్, సత్యనారాయణ, కార్తీక్, జగదీష్, సంధ్య, ప్రవీణ, బిందు, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు సమభావన కలిగి ఉండాలి

- అందరూ ఒకే వాతావరణంలో చదివినప్పుడే అది సాధ్యం
- తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



ఆధునికీకరించిన హాస్టల్‌ను ప్రారంభిస్తున్న శారద

ఇబ్రహీంపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కుల మతాల సంస్కృతి పెరిగిపోతున్న తరుణంలో సమభావన కలిగి ఉండాలని, అన్ని వర్గాల పిల్లలు ఒకే వాతావరణంలో చదివినప్పుడు అది సాధ్యమవుతుందని తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ప్రధాని మోదీ, ఆయా రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాయాలని, ఇక్కడ నుంచే ఆ సంకల్పానికి నాంది పలుకుదామని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలో కేఫెన్ టెక్నాలజీస్ సీఎస్ఆర్ నిధులు రూ.1.10 కోట్లతో ఆధునికీకరించిన ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో వసతులు కల్పించడానికి ముందుకు వచ్చిన కెఫెన్ టెక్నాలజీస్‌ను ఆమె అభినందించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటుందన్నారు. తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయొద్దని, వ్యక్తిగత విషయాలను షేర్ చేసుకోవద్దని విద్యార్థినులకు సూచించారు. ఆడ పిల్లలకు ఏదైనా సమస్య వస్తే మహిళా కమిషన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజారమణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, డీఈవో సుశీంద్ర రావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, కెఫెన్ టెక్నాలజీస్ ఫైనాన్స్ మేనేజర్ సుజయ్ పుత్రన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, తహసీల్దారు సునీతారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో జంగయ్యగౌడ్, వైద్యాధికారి డా.పూనమ్, సీఐ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మహిపాల్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మొయినాబాద్ మండల అభివృద్ధి అధికారి సంధ్యరాణి

మొయినాబాద్ రూరల్, జూలై 11(ఆంధ్యజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని మొయినాబాద్ మండల అభివృద్ధి అధికారి సంధ్యరాణి పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని అమ్డాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి, అమ్డాపూర్ పంచాయతీ ప్రత్యేకాధికారి దేవిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత, నాయకులు వడ్ల నర్సింహాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కదిలిన యువత.. బాగైన రోడ్డు

మంచాల, జూలై 11(ఆంధ్రజ్యోతి): జాపాల - కాగజ్ఘట్ రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. పలుచోట్ల గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలకు జాపాల, అస్మత్పూర్ తదితర గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. తరుచూ ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడ్డ ఘటనలు ఉన్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడతో శుక్రవారం జాపాల గ్రామానికి చెందిన యువకులు సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ట్రాక్టర్లో కంకర మిక్సింగ్ తెప్పించి గోతులు పూడ్చారు. ధ్వంసమైన చోట్ల జేసీపీ సాయంతో తాత్కాలిక మర్మమ్మతులు చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి రహదారిని బాగుచేయాలని కోరారు. యువకుల స్ఫూర్తిని వాహనదారులు ప్రశంసించారు.



ధ్వంసమైన జాపాల - కాగజ్ఘట్ రోడ్డుపై గుంతలు పూడుస్తూ చదును చేయిస్తున్న జాపాల గ్రామస్తులు

శభాష్ రోజా

దొరికిన డబ్బులు తిరిగిచ్చిన మహిళ



దొరికిన డబ్బులను తిరిగి పోలీసుల సమక్షంలో విష్ణువర్ధన్కు ఇస్తున్న రోజా

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): దొరికిన రూ.4,01,400 తిరిగిచ్చి శభాష్ అనిపించుకుంది మండలంలోని కొత్తగూడ శ్రీనిఖేతన్ హైస్కూల్ అడ్మిన్ బొద్దం రోజా. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల మండలం విఠాయిపల్లి గ్రామానికి చెందిన ఎంకే విష్ణువర్ధన్ వద్ద పనిచేస్తున్న సురేష్ గురువారం సాయంత్రం మండలంలోని జైత్వారం గ్రామానికి చెందిన రాంరెడ్డి ఫౌల్టీ ఫారం నుంచి బ్యాగులో రూ.4,01,400 స్కూటర్పై తీసుకెళ్తుండగా కొత్తగూడలోని శ్రీనిఖేతన్ హైస్కూల్ వద్ద బ్యాగ్ పడిపోయింది. గుర్తించిన వెంటనే విష్ణువర్ధన్ కందుకూరు సీఐ సీతారాంకు సమాచారం ఇచ్చాడు. దీనిపై విచారణ జరపాలని సీఐ సిబ్బంది కృష్ణ, రమేష్కు ఆదేశించారు. వారు జైత్వారం నుంచి కొత్తగూడ చౌరస్తా వరకు ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా.. కొత్తగూడ శ్రీనిఖేతన్ స్కూల్ అడ్మిన్ బొద్దం రోజా పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల సమక్షంలో ఆ డబ్బులను రోజా విష్ణువర్ధన్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పోలీసులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై సైదులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణలో అజాగ్రత్త తగదు



శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి

ఆమనగల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కంటి సంరక్షణలో అజాగ్రత్త వద్దని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీకేఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏడో రోజు సందర్శించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడారు. ఇప్పటివరకు 4500 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2,800ల మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన 170 మందిలో 110 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్గౌడ్, యూసూఫ్ బాబా, గణేశ్, రఘు, యాదయ్య, శ్రీపతి, శేఖర్, రాఘువేందర్, శ్రీను, శివ,కళ్యాణ్ పాల్గొన్నారు.


ఐరిష్ స్కూల్పై చర్యలు తీసుకోవాలి

ఆదిభట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తూ, అనుమతులు లేకుండా బుక్స్, నోట్ బుక్స్ అమ్ముతున్న ఐరిష్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షకార్యదర్శులు వంశీ, తరంగ్ డిమాండ్ చేశారు. ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో మంగల్పల్లి కొహెడ రోడ్డు సమీపంలో ఉన్న ఐరిష్ ఫ్లోరిస్ట్ వరల్డ్ స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పేర్లతో ముద్రించిన పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ అమ్ముతున్న స్కూల్పై చర్యలు తీసుకోవాలన్నారు. నోట్ బుక్స్ కొనుగోలు చేస్తానే పాఠ్య పుస్తకాలు ఇస్తామని షరతులు పెట్టి బలవంతంగా స్టేషనరీ, నోట్బుక్స్ అమ్మడం ఏమిటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారులు ఐరిష్ ఫ్లోరిస్ట్ వరల్డ్ స్కూల్కు చేరుకొని నోట్బుక్స్ అమ్ముతున్న కంటైనర్ను సీజ్ చేశారు. నాయకులు చరణ్, అజయ్, వినయ్, సాయిరామ్, సంతోష్, బన్ని పాల్గొన్నారు.



ఐరిష్ స్కూల్లో నోట్బుక్స్ అమ్ముతున్న కంటైనర్ను సీజ్ చేయించిన నాయకులు





ఆషాఢ మాసం.. గోరింటాకు సంబురం

కందుకూరు, జులై 11(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు వేడుకలు నియోజకవర్గం పరిధిలోని మీర్పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ వేడుకల్లో మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు, దాసర్లపల్లి మాజీ ఎంపీటీసీ తాండ్ర ఇందిరదేవేందర్, మాజీ సర్పంచ్లు బి.జ్యోతిచంద్రశేఖర్, సధాలక్ష్మీపుల్లారెడ్డి, కాకి ఇందిరాదశరథ, మాజీ ఎంపీటీసీ లలితాకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేతులకు గోరింటాకు పెట్టుకొని సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమమంలో నాయకులు శేరిగూడె జయ్యమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.



గోరింటాకు వేడుకల్లో మహిళా ప్రతినిధులతో సబితాఇంద్రారెడ్డి

ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రభుత్వ చీఫ్విప్ పట్నం మహేందర్రెడ్డి

బషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలంగాణ చీఫ్విప్ పట్నం మహేందర్రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్లోని నివాసంలో ఎక్మాయి గ్రామానికి చెందిన పట్లోళ్ల సుదర్శన్రెడ్డి, ముసిరిప లక్ష్మి కుటుంబాలకు రూ. 60వేల చొప్పున లక్ష 20 వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ ఆపదలో ఉన్న వాళ్లను ప్రభుత్వం ఆదుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పట్లోళ్ల శ్రీనివాస్రెడ్డి, సాయిరెడ్డి, శామప్ప ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న మహేందర్రెడ్డి



మధురాంబరీగా సర్వమంగళా దేవి

ఘట్కేసర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పోచారంలోని సర్వ మంగళా సమేత స్పటికలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన సర్వ మంగళ దేవి అమ్మవారు 3వ వారం శుక్రవారం మధురాంబరీగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల స్వీట్లతో(మధుర పదార్థాలతో) అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

చేవెళ్లలో పోస్టమెట్రిక్ హాస్టల్ ప్రారంభించాలి

చేవెళ్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో ఎస్సీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ప్రారంభించాలని పీడీఎస్యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంతానికి గత 2018లోనే ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం మంజూరైందన్నారు. 2024 వరకు చేవెళ్లలోనే ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహంలో కొనసాగిందని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. సెలవుల తర్వాత తిరిగి హాస్టల్ వసతి గృహం ప్రారంభించకపోవడంతో విద్యార్థులు వసతి కోసం అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్ను వెంటనే ప్రారంభించి అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు.

అనురాగ్ యూనివర్సిటీలో 'స్టూడెంట్ చాప్టర్'

ఘట్కేసర్ రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో 'స్టూడెంట్ చాప్టర్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీన్ ప్రొఫెసర్ నరేందర్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థుల కోసం ఐయాసీఈఈ స్టూడెంట్ చాప్టర్ను ఏర్పాటు చేస్తున్నామని, ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ఏడాది వైవిధ్యం, స్థిర అభివృద్ధిపై నిబద్ధత వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీన్ విజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీల శకం ప్రారంభమైంది

శంషాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): బీసీ శకం ప్రారంభమైందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. బీసీ హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతామని, కేబినేట్ నిర్ణయించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ను వెంటనే అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు కేత రాజనర్సింహ, పల్నాటి యాదయ్య, బొడ్డుపల్లి కృష్ణ, ఆనంద్గౌడ్, రాములుగౌడ్, సదానందగౌడ్, వెంకటయ్య, శంకర్, రమేష్, రేణుక, బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

మర్పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి అని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్రెడ్డి అన్నారు. సిరిపూరం గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో ఆర్డినేటర్ వడ్ల నందు, మల్లేశ్ యాదవ్, లక్ష్మణ్, బాలరాంగౌడ్, శ్రీమంత్కుమార్, మహేశ్వరిమైపాల్రెడ్డి, యాదవరెడ్డి, మధు, శ్రీకాంత్, శివ, యాదన్న, నాగన్న పాల్గొన్నారు.

కల్తీ కల్లు కారకులపై చర్యలు తీసుకోవాలి

గన్పార్క్, జులై 11, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్లోని కూకట్పల్లిలో జరిగిన కల్తీ కల్లు ఘటనలో కారకులపై కఠిన చర్యలు చేపట్టి డ్రగ్పై ఉక్కుపాదం మోపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాంపల్లి ఆబ్కారి శాఖ రాష్ట్ర కార్యాలయం వద్ద సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అడిషనల్ కమిషనర్ యాష్మీ ఖురేషికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం, నేతలు వెంకటేశ్, రమేష్, శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలతో ఉద్యోగావకాశాలు

మొయినాబాద్ రూరల్, జూలై 11(ఆంధ్యజ్యోతి): కళాశాలలో నిర్వహించే పరీక్షల్లో మంచి ఫలితాలు పొందితే భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో హిమాయత్ నగర్లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో డిగ్రీ, బీటెక్, ఫార్మసీ విభాగాలకు చెందిన 4వ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. వైస్ చాన్సలర్ శంకర్లింగం, రిజిస్టర్ రవీందర్, రాజు, డీన్ కవిత, సుగంధదేవి, రాజేందర్రెడ్డి, శ్రీనివాస్, కుమారస్వామి, రఘుపతి, సుదీప్తి, చంద్రమౌళి, అరవింద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న సాత్వికరెడ్డి







దశరథ్ నాయక్‌తో కలిసి చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి, జైపాల్‌యాదవ్, అంజయ్య యాదవ్

సామాజిక దృక్పథంతో సమాజంలో కీర్తి

» రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథం ఉన్న వారు సమాజంలో కీర్తించబడుతారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాలలో శుక్రవారం లంబాడిహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ కుమారుడు జర్పుల రాధాకృష్ణ స్మారకార్థం ఆయన చిత్రపటం వద్ద కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం ట్రస్ట్ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రమాదాలు, ఆకస్మికంగా మరణాలతో బాధితులుగా మారిన కడ్తాల మండల పరిధిలోని 137 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున రూ.6.85 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కడ్తాలకు చెందిన పాషా హసీన దంపతుల కుమారుడి చదువు కోసం రూ.2.75 లక్షలు దశరథ్ నాయక్ ప్రకటించారు. రాంనుంతల, ముద్విన్, గాన్గుమర్ల తండా, కానుగుబావి తండాల్లో పలు ఆలయాల నిర్మాణానికి రూ.76 వేలు అందించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శారద, గోపాలకృష్ణ, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ జెడ్పీటీసీలు ద్యాప విజితారెడ్డి, అనురాధాపత్యనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యపై పెట్టే ప్రతీ పైసా భవిష్యత్‌కు పెట్టుబడి

» రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ వెంకటేశ్

ఆమనగల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యపై పెట్టే ప్రతి పైసా భవిష్యత్‌కు పెట్టుబడి అని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారగొండ వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. కళాశాల, పాఠశాల రికార్డులను, పరిసరాలను, తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠ్యాంశాలను చదివించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. జూనియర్ కళాశాల, పాఠశాలలో నెలకొన్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలో ఫ్యాన్ల ఏర్పాటుకు రూ.4 వేలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదర్, రామస్వామి, అశోక్‌రెడ్డి, మాదవి, కృష్ణయ్య, వనిత, మధూకర్, మాలతి, కుసుమలత, బాలింగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ మాదవ రావు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు జూనియర్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని టీచ్ ఫర్ సొసైటీ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడికి వినతిపత్రం అందజేశారు. టీచ్ ఫర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె సుదర్శన్, నాయకులు ఈర్లపల్లి ప్రవీణ్, వర్షిత్, శివ, ధనుష్, శివరాజు, సాయికుమార్ ఉన్నారు.

రవాణా, పారిశుధ్యానికి నిధులు

» ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పల్లెలతోపాటు మున్సిపాలిటీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు నిధులు ఖర్చు చేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయాంజాల్‌కు వంద కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయని, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.15 కోట్లు విడుదల చేయించామన్నారు. యాచారం మండలంలో వివిధ అభివృద్ధి పనులకు టీజీఐఐసీ నుంచి రూ.20 కోట్లు విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆక్టోపస్ మీదుగా నాగన్‌పల్లి వరకు రూ.40 కోట్లతో రహదారి విస్తరణ పనులు వారంలో ప్రారంభిస్తామన్నారు. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి రూ.37 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరుకాగా, అదనంగా మరో వెయ్యి ఇళ్లు కటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు.

అనుమతి లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

తాండూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాండూరులో ప్రభుత్వ అనుమతిలేని టీహెచ్ జూనియర్ కళాశాలపై, సహకరించిన చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాయి. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'అనుమతుల్లేకుండా కళాశాల నిర్వహణ' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కే.శ్రీనివాస్ మాట్లాడుతూ సంబంధిత కళాశాలపై ఇంటర్మీడియట్ నోడల్ అధికారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం నాయకులు చంద్రయ్య, సీపీఎం జిల్లా నాయకులు బస్వరాజ్, బూస చంద్రయ్య ఉన్నారు.

బీఎల్‌వోలకు ఓటరు నమోదు ప్రక్రియపై శిక్షణ

బంట్వారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలకు ఓటరు నమోదు ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ శుక్రవారం సందర్శించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు నమోదు చేసే విధంగా బీఎల్‌వోలు చూడాలని సూచించినట్లు తెలిపారు. అంతకు ముందు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

సీఎం ఇలాఖాలో నాణ్యత లేని రోడ్లు

దౌల్తాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సీఎం ఇలాఖా కొడంగల్ ప్రాంతంలో కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా నాణ్యత లేని రోడ్ల నిర్మాణం చేపడుతున్నారని మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్, బోడమర్రితండా గ్రామానికి నాణ్యత లేకుండా రోడ్లు వేసినా కాంగ్రెస్ నాయకులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. 20శాతం కమిషన్ కట్టబెట్టి తమ ఇష్టానుసారంగా చేపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు కేశవరెడ్డి, వెంకటమ్మ వకరీప్ప, తోక ఆశప్ప, భీములు, రాజుయాదవ్, మహిపాల్, హనుమంతు, బాల్‌రాజ్, రమేశ్, అప్పిరాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

శంకర్‌పల్లి/ఆదిభట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు తప్పవని మోకిల సీఐ వీరబాబు హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మోకిల, జన్వాడ గేటు వద్ద ఇళ్ల నిర్మాణాలలో పని చేస్తున్న ఆరుగురి పిల్లలకు శుక్రవారం విముక్తి కల్పించారు. వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను పనికి పంపకుండా పాఠశాలకు పంపించాలని ఆయన సూచించారు. అలాగే ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ నూతన భవనంలో పనులు చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పదహారు ఏళ్ల బాలకార్మికురాలికి విముక్తి కల్పించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎంపీపటేల్‌గూడ విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కాలేజీ పక్కన నిర్మిస్తున్న అనిల్ కన్‌స్ట్రక్షన్‌లో ఇటుక పనులు చేస్తున్నట్లు సమాచారం అందింది. కానిస్టేబుల్ శ్రీశైలం అక్కడి చేరుకొని బాలకార్మికురాలికి విముక్తి కల్పించి కన్‌స్ట్రక్షన్ యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

» కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



ఇందిరమ్మ మోడల్ ఇంటిని ప్రారంభించిన తిరుపతిరెడ్డి, నాయకులు

కొడంగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంత అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కొడంగల్ పెద్ద చెరువు కట్ట అభివృద్ధికి రూ.45 కోట్లతో శంకుస్థాపన చేశారు. చెరువు కట్ట అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీరామ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు ప్రశాంత్, రఘువర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో ఉషశ్రీ, సంజీవ్‌రెడ్డి, కృష్ణంరాజు, నయీమ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



బోనమెత్తిన బిజ్వార్

తాండూరు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్వార్ గ్రామంలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం గ్రామ దేవతలు బోనమ్మ, రక్తమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతురాజు విన్యాసాం ఆకట్టుకుంది. మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఉప సర్పంచ్ పోతుగంటి హన్మంతు, నాటు వైద్యులు కిష్టప్ప, గ్రామస్తులు మల్లేశం, రఘుపతిరెడ్డి, ముని, భీమప్ప, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మూత'బడి'.. తెరుచుకొని!



కులకచర్ల మండలం ఎర్రగోవింద్‌తండాలో విద్యార్థులకు బోధిస్తున్న టీచర్ ప్రియాంక

(మూడో పేజీ తరువాయి)

క్రమంగా మార్పు వస్తుంది. జీరో అడ్మిషన్లతో మూతబడిన పాఠశాలల్లో పిల్లలు రాకతో మళ్లీ కళకళలాడుతున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో ఈ విద్యాసంవత్సరమే 32 స్కూళ్లు తెరుచుకున్నాయి. వీటిలో 225 మంది విద్యార్థులు చేరారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 32స్కూళ్లు రీఓపెన్ చేయగా, ఇందులో ఇప్పటి వరకు మొత్తం 225 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందరు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 97 పాఠశాలలు మూతపడగా, ఈసారి 27 పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. వీటిల్లో 194 మంది విద్యార్థులు చేరారు. జీరో అడ్మిషన్ల కారణంగా గతంలో ఈ పాఠశాలలు మూతపడగా, అక్కడే విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ చేపట్టి తిరిగి ప్రారంభించారు. ఆమనగల్లు మండలంలోని దయ్యాల బోర్డు తండా, గౌరారం, సంకటోనిపల్లి, చేవెళ్ల మండలంలోని నారాయణదాస్‌గూడ, కందుకూరు మండలంలోని పంతులగూడ తండా, కొందుర్గు మండలంలోని అయోధ్యాపూర్ తండా, చెక్కలోనిగూడ, కొత్తూరు మండలంలోని అక్కివానిగూడ, ఎల్‌ఆరేతండా, తిమ్మాపూర్ రైల్వేస్టేషన్, మాడ్గుల మండలంలోని కుబ్యా తండా, నర్సంపల్లి, నెల్లికొండ తండా, పెద్దమాడ్గుల, తోడేలే గుండుతండా, మహేశ్వరం మండలంలోని అబీబ్‌గూడ, మంచాల మండలంలోని కొరివితండా, ఎల్లమ్మ తండా, మొయినాబాద్ మండలంలోని చిన్న షాపూర్, నందిగామ మండలంలోని మంచాన్‌పహాడ్, మొదలు గడ్డ తండా, తాళ్లగూడ, షాబాద్ మండలంలోని మంచన్‌పల్లి తండా, యాచారం మండలంలోని బొల్లిగుట్ట తాండ, ఎరుగుళ్ల తండా, మంతన్‌గౌడ్ పాఠశాలలను తిరిగి ప్రారంభించారు.

వికారాబాద్ జిల్లాలో మూతపడిన ఐదు స్కూళ్లు ఈసారి తెరుచుకున్నాయి. వీటిల్లో మొత్తం 31 మంది విద్యార్థులు చేరారు. మండల పరిధిలోని నాగారం తండాలో 25 కుటుంబాలు ఉన్నాయి. తండాలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేరని మూడేళ్ల క్రితం ప్రభుత్వం మూసేసింది. కాగా, దీనిని ఈ విద్యా సంవత్సరం తిరిగి తెరిచారు. ఉపాధ్యాయురాలు సౌజన్య తండాలో గత వేసవిలో ఇంటింటికి తిరిగి పిల్లలను బడిలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు నచ్చ చెప్పారు. తండా నుంచి నాగారంలోని ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఆమె కృషి చేసింది. ప్రస్తుతం పాఠశాలలో ఒకే తరగతి గదిలో నాలుగు తరగతులను నిర్వహిస్తున్నారు. ఒకే ఉపాధ్యాయురాలు అన్ని సబ్జెక్టులను అన్ని తరగతులను బోధిస్తున్నారు. ఒకటో తరగతిలో ఇద్దరు, రెండో తరగతిలో ఒకరు, మూడో తరగతిలో నలుగురు, నాలుగవ తరగతిలో ఇద్దరు విద్యార్థులు చేరి విద్యను అభ్యసిస్తున్నారు. కాగా వీరికి పాఠశాల యూనిఫాం ఇంకా అందలేదు. కొన్ని పాఠ్యపుస్తకాలు అందలేదు.



ధారూరు: తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

కులకచర్ల మండలంలో గతంలో మూతపడిన మూడు పాఠశాలలు ఈ విద్యాసంవత్సరం రీఓపెన్ చేశారు. కులకచర్ల మండలంలోని ఎర్రగోవింద్‌తండా, అలగుగడ్డతండా, కిష్టంపల్లితండా పాఠశాలలను తిరిగి ప్రారంభించారు. ఎర్రగోవింద్‌తండా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎనిమిది విద్యార్థులు నమోదయ్యారు. అలుగుగడ్డతండా పాఠశాలలో ఇద్దరు పిల్లలు నమోదు కాగా, వారు తల్లిదండ్రుల వెంట పూణెకు వెళ్లిపోయారు. ఉపాధ్యాయుడు నిత్యం పాఠశాలకు వచ్చి కూర్చొని వెళ్లిపోతున్నాడు. కిష్టంపల్లి తండాలో పది మంది విద్యార్థుల నమోదయ్యారు.

నవాబుపేట మండలంలోని కేశవపల్లి ప్రాథమిక పాఠశాల కూడా ఈ ఏడాది తెరుచుకుంది. మూడేళ్ల క్రితం మూతపడిన పాఠశాల ఇటీవల బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో 14 మంది విద్యార్థులు చేరారు. అదే విధంగా మండలంలోని వట్టిమీనపల్లి, దాదాపూర్, ఎత్రాస్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, సాయన్నగూడ గ్రామాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. ఆయా పాఠశాలల పునఃప్రారంభానికి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ప్రభుత్వ బడులను తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో అబ్దుల్ రహెమాన్ తెలిపారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి తల్లిదండ్రులకు నచ్చచెబుతామని ఎంఈవో తెలిపారు.

బాగా చదివిస్తున్నారు



పాఠశాలలో బాగా చదివిస్తున్నారు. మూడో తరగతి వరకు నాగారంలో ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం చదివి నాలుగో తరగతిలో ఈ పాఠశాలలో చేరాను. ఇంగ్లీషు మీడియంలోనే పాఠాలు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం మంచిగా వడ్డిస్తున్నారు. ఇంకా యూనిఫాం ఇవ్వలేదు

- పావని, విద్యార్థిని, 4వ తరగతి

తండాలోని పిల్లలందరినీ చేర్పించాం



నాగారం ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న తండా పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించాం. నా మనుమడిని కూడ సర్కార్ బడికి పంపించాను. మూడేళ్ల కిందట పిల్లలు లేక తండాలోని బడి మూసేశారు. పాఠశాలలో పిల్లలకు చదువు మంచిగా చెప్పి వసతులు కల్పించాలి.

- మోతీబాయి, నాగారం తండా

అటవీ భూమిపై జాయింట్ సర్వే అవసరం

కబ్జాపై కదిలిన అటవీ శాఖ అధికారులు



మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధారూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'రియల్టర్ కబ్జాలో అటవీ భూమి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ స్పందించారు. మండల పరిధిలోని అల్లాపూర్ శివారులో అటవీ భూమి కబ్జా పై విచారణ చేయాలని ఫారెస్ట్ విజిలెన్సు అధికారులను ఆదేశించారు. డీఎఫ్‌వో రాజశేఖర్, రేంజర్ వీరేశం ధారూరు అటవీ రేంజర్ రాజేందర్‌తో కలిసి అల్లాపూర్ శివారులోని ఫారెస్ట్ ఎఫ్ బ్లాక్‌ను శుక్రవారం పరిశీలించి విచారణ జరిపారు. పక్కనే భూములు కొనుగోలు చేసిన రియల్టర్లు అటవీ భూ ఆక్రమణపై సర్వే నంబరు 11లోని ఎఫ్ బ్లాక్‌కు సంబంధించిన గెజిట్ మ్యాపును పరిశీలించారు. గతంలో తీసిన కందకాల వెంబడి రియల్టర్లు కొంత భాగం తవ్వినట్లు గుర్తించారు. అయితే ఇక్కడ అటవీ భూమి విస్తీర్ణం, హద్దులను అధికారులు పూర్తి స్థాయిలో గుర్తించలేకపోయారు. గతంలో తీసిన కందకాలు, పాతిన హద్దు రాళ్లు గెజిట్ ప్రకారమే ఉన్నాయా, లేదా అనేది విజిలెన్సు అధికారులు తేల్చలేకపోయారు. సర్వే నంబరు 11లో కొంత రెవెన్యూ భూమి ఉన్నందున ఫారెస్టు, రెవెన్యూ జాయింట్ సర్వే చేయిస్తేనే అటవీ భూమి కబ్జా జరిగిందా, లేదా? అనేది తేలుతుందని నిర్ణయానికి వచ్చారు. అయితే అటవీ పాత హద్దులను చూపించాలని ఓ రైతు విజిలెన్సు అధికారులను కోరాడు. గతంలో కందకాలు తీసే సమయంలో హద్దు రాళ్లు పాతడంలో ఫారెస్టు అధికారులు అవకతవకలకు పాల్పడటం వల్లనే అటవీ భూమి కబ్జాకు గురైందని పలువురు రైతులు అంటున్నారు.

వైల్డర్‌నెస్ రిసార్ట్‌లో అధికారుల తనిఖీ

» కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



చెరువులో బోటింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటనపై ఎట్టకేలకు అధికారులు విచారణ చేపట్టారు. గత శనివారం బీహర్‌కు చెందిన ఇద్దరు మహిళలు స్థానిక వైల్డర్ నెస్ రిసార్ట్‌లో నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా సర్పన్‌పల్లి చెరువులో బోటింగ్ చేస్తూ మరణించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి రిసార్ట్‌ను సందర్శించి కలెక్టర్‌కు లేఖ రాశారు. అయినా అధికారులలు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఎట్టికేలకు పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు కాలు కదిపారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలతో శుక్రవారం రిసార్ట్‌ను తనిఖీ చేశారు. తనిఖీల్లో డీపీవో జయసుధ, ఇరిగేషన్ ఎస్ఈ రంగారెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, మైనింగ్ ఏడీ సత్యనారాయణ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. ముందుగా ఘటన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో బోటులో ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. అనంతరం రిసార్ట్ అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులు ఆరా తీశారు. ఇరిగేషన్ అధికారులు సైతం చెరువులో కట్టిన బెడ్ రూమ్‌ల గురించి సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. రిసార్ట్ ఘటనపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో వాసుచంద్ర ఆంధ్రజ్యోతితో తెలిపారు.

అన్నీ అధికారులకు తెలిసే?

ది వైల్డర్ నెస్ రిసార్ట్ కోసం వెళ్లిన అధికార బృందానికి అక్కడ జరుగుతున్న తతంగం అంతా తెలుసని, ఇద్దరి ప్రాణాలు పోయిన వారం రోజులకు నామమాత్రంగా వెళ్లడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిసార్ట్‌లో అసైన్డ్‌లైడ్ ఉందని రెవెన్యూ అధికారులకు తెలిసినా, చెరువులో బోటింగ్ జరుగుతుందని ఇరిగేషన్ అధికారులకు తెలిసినా ఏనాడు పట్టించుకోలేదని మండి పడుతున్నారు. ఇప్పుడు కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలు చేపట్టడమే తప్పా అధికారులు ఆ రిసార్ట్‌పై చర్యలు తీసుకోరని ఆరోపిస్తున్నారు. రిసార్ట్ నిర్వాహకులకు రాజకీయ అండదండలు ఉన్నాయని, ఇది నామమాత్రపు తనిఖీ మాత్రమేనని అంటున్నారు. ఎంపీ లేఖతోనే అధికారులు కదిలారే తప్ప ఆ వైపు కనీసం కన్నెత్తి కూడా చూసేవారు కాదని మండి పడుతున్నారు.



దివ్యాంగులకు ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

కేశంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలంలో దివ్యాంగుల భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించడంతో శుక్రవారం దివ్యాంగుల సంఘం మండల సభ్యులు షాద్‌నగర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానిస్తుండగా తిరిగి ఆదే శాలువాతో దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు మైసయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకరావడంతో భవనం మంజూరు చేయించానని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, ఏపీఎం భగవంతు, సీసీలు నరసింహ, యాదయ్య, నాయకులు యెన్నం శ్రీధర్ రెడ్డి, రావుల పెంటయ్య, జంగయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై సంబురాలు

» కడ్తాలలో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ



కడ్తాలలో మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

కడ్తాల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో తీర్మానించడాన్ని హర్షిస్తూ కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై పార్టీ జెండాలతె ర్యాలీ చేపట్టి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయడానికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. నాయకులు హన్మనాయక్, లక్‌పతి నాయక్, కృష్ణ, బోసు రవి, తాళ్ల రవీందర్, చేగూరివెంకటేశ్, నరేశ్ నాయక్, జవహర్‌లాల్ నాయక్, రాజేందర్, బానుకిరణ్, తులసీరామ్ నాయక్, మల్లేశ్‌గౌడ్, యాదయ్య, శంకర్, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులున్నారు.

కబ్జా కోరల్లో కాలువలు!

(మూడో పేజీ తరువాయి)

సరిపెడుతున్నారు. రియల్ వ్యాపారులకు అధికారులు వత్తాసు పలకడంతో కాల్వలను ఆక్రమించడమే కాకుండా నాలా స్వభావాన్ని మార్చేస్తున్నారు. విస్తీర్ణం తగ్గించి, కొత్త కాలువలను నిర్మిస్తున్నారు. దీంతో ఇబ్రహీంపట్నం, కొంగరకలాన్, మంగల్‌పల్లిలోని అనేక చెరువులు కుంటలు మాయం కాగా, మిగిలినవి కూడా ఆనవాళ్ల కోల్పోతున్నాయి.


సాహెబ్‌గూడ కుంట కల్వర్టును తొలగించిన రియల్టర్లు

దర్జాగా ఆక్రమణలు

ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్, మంగల్‌పల్లి, ఎంపీపటేల్‌గూడ, బొంగ్లూర్, రాందాస్‌పల్లి, సాహెబ్‌గూడ, ఫిరోజ్‌గూడల్లో 16 చెరువులు ఉన్నాయి. దీంతో పాటు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు ప్రధానమైన రాచకాల్వ(పిరంగి), పులందరీ కాలువలు ఉన్నాయి. పిరంగి కాలువ ఆదిభట్ల నుంచి బొంగ్లూర్, ఎంపీపటేల్‌గూడ, కొంగరకలాన్, సాహెబ్‌గూడ, మంగల్‌పల్లి, ఉప్పరిగూడ మీదుగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు ఉంటుంది. ఇదిలా ఉండగా ఆదిభట్ల హైదరాబాద్‌కు, ఓఆర్ఆర్‌కు కూతవేటు దూరంలో ఉండడంతో పాటు ఈ ప్రాంతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీల ఏర్పాటుతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇప్పటికే చాలావరకు వ్యవసాయ భూములను సైతం వెంచర్లుగా మార్చారు. ప్రస్తుతం ఆదిభట్లలో భూములు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో రియల్ వ్యాపారులు శిఖం, నాలాల సమీపంలో ఉన్న భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేస్తున్నారు. ఈ భూముల పక్కనుంచే నాలాలు ప్రవహిస్తుడటంతో ఆదిభట్ల, బొంగ్లూర్, ఎంపీపటేల్‌గూడ, మంగల్‌పల్లి రెవెన్యూ పరిధిలోని శివారుల్లో నాలాలను యథేచ్ఛగా ఆక్రమించి నాలాలపై వంతెన నిర్మాణాలు చేపడుతున్నారు. ఓ వెంచర్ నిర్వాహకుడు బఫర్ జోన్‌ను ఆక్రమించి పార్క్ స్థలం ఏర్పాటు చేశాడు. సాహెబ్‌గూడెం కుంట ఫుల్‌ట్యాంక్ లెవల్‌ను తగ్గించడానికి ఓ రియల్ వ్యాపారి ఏకంగా కల్వర్టును తొలగించాడు. కొంగరకలాన్ దాతర్‌చెరువు కట్టను కూల్చి రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏకంగా కాలువను కబ్జా చేసి, కాల్వ విస్తీర్ణం తగ్గించి కొత్త కాలువను నిర్మిస్తున్నాడని అధికారులకు కొంగరకలాన్ ప్రజలు, రైతులు ఫిర్యాదు చేశారు. బొంగ్లూర్- ఎంపీపటేల్‌గూడ మధ్యలో ప్రవహిస్తున్న రియల్ వ్యా పారి కాలువను కబ్జాచేసి బఫర్‌జోన్‌లో మట్టి నిం పాడు. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే చేసి హద్దురాళ్ల ఏర్పాటు చేశారు. కానీ రియల్ వ్యాపారి బఫర్ జోన్‌లో పోసిన మట్టిని తొలగించలేదు. సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ఓ వెంచర్ నిర్వాహకుడు బఫర్‌జోన్‌ను ఆక్రమించి ప్రీకాస్ట్ వాల్ వేశాడు. చెరువులు, కాలువల కబ్జాకాకుండా చూడాల్సిన అధికారులు రియల్టర్లకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు పట్టించుకోవడం లేదు



కబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో రియల్ వ్యాపారులు ఇష్టానుసారంగా కాలువలను కబ్జా చేస్తున్నారు. పులందరి, పిరంగి కాల్వల్లో అడ్డంగా పైపులు వేసి మట్టి పోశారు. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తే పరిశీలించి వదిలేస్తున్నారు. కానీ, కబ్జాచేసిన సదరు రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవడం లేదు. కాల్వలో పోసిన మట్టిని తొలగించలేదు.

- ఎరుకుల శివకుమార్, ఎంపీపటేల్ గూడ


రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ

చౌదరిగూడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, నేర నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ పోలీస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం కొందుర్గు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీసి త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్సై రవీందర్ నాయక్‌కు సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏసీపీ సూచించారు.

నేడు కేశంపేటకు ఎమ్మెల్సీ కవిత రాక

కేశంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు(శనివారం) కేశంపేట మండలానికి వస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు చీమల రమేశ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా మహాలక్ష్మి పథకం అమలు చేయకపోవడంతో మండల పరిధిలోని కాకునూర్ గ్రామ మహిళల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపిచనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వేములనర్వలో జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు నాయకులు తరలిరావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కు ఇస్తున్న పాలమాకుల జంగయ్య

షాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పేదలు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో మండల పరిధిలోని నాగర్‌కుంటకు చెందిన రంగారెడ్డికి రూ.1,48000 చెక్కును శుక్రవారం షాబాద్‌లో అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, పర్వతాలు, మండల కార్యదర్శి శ్రీశైలం, నాయకులు తదితరులు ఉన్నారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం

తలకొండపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనకు సీసీ కెమెరాలు ఎంత గానో దోహదపడుతాయని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గట్టిప్పలపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ నాయకుడు అశోక్‌గౌడ్ రూ.5 వేలు శుక్రవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, స్థానిక నాయకులతో కలిసి ఎస్ఐ శ్రీకాంత్‌కు అందజేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన అశోక్‌ను పోలీసులు అభినందించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, గోపాల్, మహేశ్, శరత్‌చంద్ర, అంజనేయులున్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం : వీర్లపల్లి


షాద్‌నగర్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చడం అభినందనీయమన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని హర్షిస్తూ శుక్రవారం పార్టీ కార్యకర్తలతో కలిసి మహాత్మ జ్యోతిబాపూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్న విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తించాలని సూచించారు.

కందుకూరు : సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ సరికొండ మల్లేష్‌లు అన్నారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సౌడపు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, డిల్లీ శ్రీధర్, యుగేందర్‌గౌడ్, అజీజ్, సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్, వి.బాబు, పాండురంగారెడ్డి, దర్శన్, కుమార్, మోటి రమేష్, కృష్ణ, మహేందర్, గాండ్ల నవీన్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతీ హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేస్తూ వస్తోందని పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌లు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయం తెలపడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు పార్టీ మండలాధ్యక్షుడు తమ్మళి మాణయ్య ఆధ్వర్యంలో మొయినాబాద్ మున్సిపల్ పరిధి హిమాయత్ నగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చే ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. ఎన్కేపల్లి రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీనియర్ నాయకులు బొలిగిద్ద సత్యనారాయణ, పురా ణం వీరభద్రస్వామి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, జయరాంరెడ్డి, భాస్కర్ తదితరులున్నారు.

మహేశ్వరం : కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు నిర్ణయించడం శుభ పరిణామమని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, కాకి ఈశ్వర్, అల్లెకుమార్, యాదయ్య, రాజునాయక్, అంద్యానాయక్, లాజర్, చంద్రమోహన్, సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ సతీష్, బీంభరత్


మహేశ్వరం : రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో ఒరిగేదేమీలేదు

బీఎస్పీ నేత దొడ్డి శ్రీనివాస్

షాద్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 42 శాతం రిజర్వేషన్ల వల్ల బీసీలకు ఒరిగేదేమీ లేదని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 42 శాతం రిజర్వేషన్ వల్ల చట్టసభల్లో ఎలా అడుగు పెడతారో కాంగ్రెస్ ప్రభుత్వ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రమే వర్తిస్తాయని, చట్టసభల ఎన్నికలకు ఏమాత్రం వర్తించవని ఎద్దేవా చేశారు. చట్టాలు చేయడానికి వీలుగాని విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి బీసీలను మోసగిస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అంతర్గతంగా ఒకటిగా నిలిచి బీసీలకు నష్టం కలిగించే విధానాలను తీసుకువస్తున్నారని విమర్శించారు. బీసీలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన వాటా గురించి మాట్లాడకుండా చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను బీసీలు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు.


ఎన్కేపల్లి రైతులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న కేఎస్ రత్నం

గోశాల ఏర్పాటుపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

మొయినాబాద్ రూరల్, జూలై 11(ఆంధ్యజ్యోతి): ఎన్కేపల్లిలోని ప్రభుత్వ స్థలంలో గోశాల ఏర్పాటు నిర్ణయం విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కేఎస్ రత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్కేపల్లి గోశాల భూములను చేవెళ మండల బీజేపీ నాయకులు రత్నం ఆధ్వర్యంలో సందర్శించి రైతులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ గోశాలకు తాము వ్యతిరేకం కాదని.. ఎన్నో ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్న పేదల భూములను లాక్కొని ఏర్పాటు చేయడానికి మాత్రం వ్యతిరేకమని, వేరే చోట గోశాల ఏర్పాటు చేస్తే సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. బాధితులకు తగిన న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. చేవెళ్ల మండలాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కుమార్‌గౌడ్, శర్వలింగం, వెంకటరమణారెడ్డి, జయశంకర్, ఆంజనేయులు, ఉమాశంకర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాగా, ఎన్కేపల్లి గోశాల భూ బాధితులు రాత్రీపగలు తేడా లేకుండా అక్కడి భూముల్లోనే తిష్ఠ వేశారు. ఏ సమయంలో అధికారులు వచ్చి తమ భూముల్లో పాగా వేస్తారేమోనన్న భయందోళన వారిని వీడటం లేదు. ప్రభుత్వం తమ డిమాండ్లకు అనుగుణంగా పరిహారం ఇచ్చేవరకు భూములను ఇచ్చేదిలేదని తేల్చిచెబుతున్నారు. వంటావార్పు చేపట్టి గోశాల ఏర్పాటు చేసే భూముల్లోనే ఉంటున్నారు. వీరికి పలు పార్టీల నాయకులు మద్దతు ప్రకటిస్తున్నారు. వారం రోజులుగా రిలే దీక్షకు చేపడుతున్నారు.

ప్రజాపాలన పేరుతో నిర్బంధకాండ

● మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్


పోలీసులు అదుపులోకి తీసుకున్న నాయకులతో జైపాల్ యాదవ్

తలకొండపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో నిర్బంధకాండ కొనసాగిస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆరోపించారు. హామీలను విస్మరించి నియంత పాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని నెలల కాలంగా జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో మాడ్గుల మండల పర్యటనకు వస్తున్న మంత్రులకు మండల కేంద్రం ఏర్పాటుకు వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమయ్యారు. మంత్రులను అడ్డుకుంటారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యలో భాగంగా జేఏసీ, బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టుచేసి తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న జైపాల్ యాదవ్, కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సత్యం, మాజీ జడ్పీటీసీలు అనురాధ పత్యనాయక్, దశరథ్‌నాయక్, విజితారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు పోలీసులు సొంత పూచీకత్తుపై అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేశారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి యత్నిస్తున్న వారిని ప్రభుత్వం అరెస్టులు చేయడం సరికాదన్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ దుర్మార్గ పాలన సాగిస్తుందని ఆయన మండిపడ్డారు. చంద్రశేఖర్ రెడ్డి, జ్యోతయ్య, కృష్ణయ్య, జోగు వీరయ్య, లాయక్‌అలీ, వెంకటయ్య, అశోక్‌గౌడ్, మహేశ్, శరత్ చంద్ర, రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులే కారణం!

ఇబ్రహీంపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ త్రిశక్తి కాలనీలో అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కర్ణంగూడకు చెందిన చలమందాచారి (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మొయినాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం చాకలి గూడకు చెందిన బీజేపీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో షాబాద్ దర్శన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదన్నారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల మాజీ ప్రధాన కార్యదర్శి కమ్మెట కుమార్‌యాదవ్‌తో పాటు కడియాల ప్రవీణ్ యాదవ్, నవీన్‌యాదవ్, రమేష్‌యాదవ్, వేణుయాదవ్, ఆనంద్‌యాదవ్‌చ కొమురయ్య, పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు రాజేష్‌గౌడ్, మోమిన్‌పాష, కలీల్ పాష, అలీమ్, రజినికాంత్‌గౌడ్, గిరీష్ యదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

చేవెళ్ల : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే యాదయ్య అందించారు. 52మందికి గాను రూ.23,80,500 విలువైన చెక్కులు అందజేసినట్లు చెకప్పారు. అలాగే మహిళాశక్తి పథకంలో భాగంగా భరోసా పథకం కింద మైనార్టీ మహిళలు 21 మందికి కుట్టుమెషీన్లు అందించారు. మరో ఇద్దరికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాలతికృష్ణరెడ్డి, ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, రాములు సీనియర్ నాయకులు బల్వంత్‌రెడ్డి, మల్లేష్, దర్శన్, మండలాధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఆమనగల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ నవచైతన్య కాలనీలో శుక్రవారం కమిషనర్ శంకర్‌నాయక్ పర్యటించారు. బోరు మోటర్ తరచూ కాలిపోవడం వల్ల వస్తున్న ఫిర్యాదులు అందడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, వాటర్‌మెన్‌లు గణేశ్, అభిరామ్‌లతో కలిసి కాలనీని సందర్శించారు. సమస్యలు పరిష్కరిస్తామని, ఇంటింటా నీటిసంపులు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

ఆమనగల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, రక్షణకు పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు బొజ్జ సాయిరెడ్డిలు అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్నిరంగాల్లో మరింతగా రాణించాలని కోరారు. కొల్కులపల్లిలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన సాగిస్తుందన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న కిషన్ రెడ్డి, సాయిరెడ్డి

అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం


యాచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

యాచారం/కేశంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి కుటుంబ నియంత్రణ పాటించాలని, అధిక జనాభా అభివృద్ధికి ఆటంకమని యాచారం మండల వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం యాచారం ప్రభుత్వాసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మనం ఇద్దరం.. మనకిద్దరు అనే ప్లకార్డులు ప్రదర్శించారు. ఇద్దరు పిల్లల అనంతరం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకునేలా జాగ్రత్తపడాలని మహిళలకు సూచించాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యమని కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిఖిత అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేశంపేట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.


కేశంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

యాచారంలో ప్రభుత్వాసుపత్రి భవనం నిర్మిస్తాం


మాడ్గుల : మంత్రులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

యాచారం/మాడ్గుల, జూలై 11(ఆంధ్రజ్యోతి): యాచారం మండల కేంద్రంలో ఏరియా ఆసుపత్రి భవనం నిర్మిస్తామని, ఇటీవల వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చినట్లు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లికృష్ణారావులు తెలిపారు. శుక్రవారం మాడ్గుల మండల కేంద్రానికి వెళుతూ యాచారం మండల కేంద్రంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదరం రాజనర్సింహలు కొద్దిసేపు ఆగారు. వారిని కాంగ్రెస్ మండల్యాక్షుడు మస్కు నర్సింహ, నాయకులు వరికుప్పల తిరుమలేష్, గుండ్లపల్లి సురేందర్‌రెడ్డి తదితరులు శాలువాలు కప్పి సత్కరించారు. మండల కేంద్రంలో ఆసుపత్రి భవనం నిర్మించాల్సి ఉందని, గతంలో ఆనాటి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారని, భవన నిర్మించడానికి తక్షణమే నిధులు విడుదల చేసి భవనం నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు మంత్రులకు వివరించడంతో.. తాను రెండు రోజుల క్రితం ఇదే విషయమై అధికారులతో మాట్లాడినట్లు మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. అలాగే రహదారి విస్తరణకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మండలంలో పర్యటించి నిధులు ఇస్తామన్నారు. ఏఎంసీ డైరెక్టర్ అక్బర్, ఎండీ రణి, వెంకటరెడ్డి తదితరులున్నారు. అలాగే మంత్రులకు మాడ్గుల మండల నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

తలకొండపల్లి జూలై 11(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆ సంఘం మండలాధ్యక్షుడు వై.మల్లయ్య, సీఐటీయు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్యలు అన్నారు. గొర్రెలు,మేకలకు కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా మందులు ఇవ్వడం లేదని ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం సంఘం సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు మల్లయ్య అధ్యక్షతన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు.

ఓటర్ల జాబితా పక్కాగా చేపట్టాలి

షాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండాలని షాబాద్ తహసీల్దార్ అన్వర్ తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, చనిపోయినవారి పేర్ల తొలగింపు పక్కాగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో నిర్మిస్తున్న షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం కోసం ఎన్‌హెచ్ 44 హోటల్ నిర్వాహకుడు చందు రూ.52 వేల విరాళం ఇచ్చారు. శుక్రవారం తన కుమారుడి పుట్టినరోజు వేడుకకు హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విరాళం ఇచ్చి ఉదారత చాటుకున్నాడు. చందు దంపతులను ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. కాంగ్రెస్ నాయకులు విశ్వం, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, కె.పురుషోత్తంరెడ్డి, కొమ్ము కృష్ణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లకింద చెట్లకొమ్మలను తొలగిస్తున్న క్రమంలో నేడు(శనివారం) ముచ్చర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని దాసర్లపల్లి, ముచ్చర్ల ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కందుకూరు, జులై 11(ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత నిర్మాణమే బలమైన పునాది అని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, ఎన్నికల నిర్వహణ క్లస్టర్ కన్వీనర్ కాకి ఈశ్వర్, యాదయ్యలు అన్నారు. శుక్రవారం పీసీసీ ఆదేశాల మేరకు మండలంలోని బాచుపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశం అనంతరం గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెవులపల్లి కృష్ణ, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా కత్తుల శ్రీశైలం, మహిళ అధ్యక్షురాలిగా కె.లక్ష్మీబాయ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పి.కృష్ణ, మైనార్టీసెల్ అధ్యక్షుడిగా జాంగీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నర్సింహ, రాజునాయక్, నవీన్‌గౌడ్, యుగేందర్ గౌడ్, వెంకటేష్, బాలమల్లేష్‌యాదవ్, సుధాకర్, శ్రీశైలం, దేవేందర్‌గౌడ్, రాములు, కుమార్, అంజయ్య.. రాఘవేందర్, నాగేష్‌గౌడ్ తదితరులున్నారు.


గ్రామశాఖ నూతన కమిటీతో ఈశ్వర్, యాదయ్య, పాండురంగారెడ్డి